# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 29 జనవరి , 2026 | పేజీలు : 06


## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఆదేశాలతో మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలలో రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించారు. ప్రధాన రహదారులు కూడళ్లు బస్టాండ్ ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి పూర్తిగా తొలగించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అనుమతి లేకుండా ప్రచార సామగ్రి ఏర్పాటు చేస్తే కేసులు నమోదు జరుగుతుందని ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

# అశావహులు ఫుల్...

# నామినేషన్లు నిల్..

**తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా రాని వైనం : జనంలో బలమున్న నేతకే బీ- ఫామ్**

**నామినేషన్లకు నేడు రేపే మిగిలింది**






**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 28 వార్డులు ఉండగా ఆయా వార్డులలో పోటీ చేసేందుకు అశావాహులు ఫుల్‌గా ఉన్నా గాని నామినేషన్లు దాఖలు చేయడంలో మాత్రం నిల్‌గా నిలిచింది. బుధవారం నామినేషన్లు స్వీకరించేందుకు మున్సిపల్ అధికారులు టౌన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కౌంటర్లలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం పార్టీల నుండి వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు చాలమంది అభ్యర్థులు జోష్‌లో ఉన్నారు. మారిన రిజర్వేషన్లలో భాగంగా చాల మంది సిట్టింగ్ స్థానాలు తారుమారయ్యాయి. ఇదిలా ఉండగా పార్టీ గుర్తులపై పోటీ చేసేందుకు ఆశావాహులు తమ తమ పార్టీల నుండి టిక్కెట్ కేటాయించాలని దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే. ఎక్కువగా అధికార పార్టీ కాంగ్రెస్ నుండి బరిలో నిలిచేందుకు మొగ్గు చూపుతున్నారు. జనరల్, బిసి, ఎస్సీ, ఎస్టీ స్థానం అనే తారతమ్యం లేకుండా కాంగ్రెస్ పార్టీ పోటీ చేసేందుకు అభ్యర్థులు పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో 28 వార్డులలో అధికార పార్టీకి చెందిన ఆయా వార్డులకు నియమించిన ఇన్‌ఛార్జులు చేసిన సర్వే ప్రకారం బలంగా ఉన్న నాయకుడికే భి పామ్ లు ఇవ్వనున్నట్లు సమాచారం. రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రధాన శాఖలకు మంత్రిగా ఉన్న నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్నటువంటి మున్సిపాలిటిలో 28 వా ర్డులు, నేరేడుచర్ల మున్సిపాలిటిలోని 15 వార్డులు క్లీన్ స్వీప్ చేసే దిశగా పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం సమాలోచనలు చేస్తున్నట్లుందనే చెప్పాలి. అందుకోసమేనేమో ఏ అభ్యర్థికి టిక్కెట్ కేటాయించాలో అచితూచి సర్వేల ప్రకారం ప్రజల మద్దతు ఎక్కువగా ఏ అభ్యర్థికి లభిస్తుందో ఆయా అభ్యర్థులకు మాత్రమే కాంగ్రెస్ పార్టీ బిఫామ్ లు ఇవ్వనున్నట్లు



సమాచారం. నామినేషన్లకు నేడు, రేపు గడువు మిగిలింది. కాంగ్రెస్ పార్టీలో టిక్కెట్ రాని ఆశావాహులు రెబల్‌గా నిలిచి పోటీ చేసే అవకాశాలు కూడా మెండుగానే ఉన్నాయి. మరికొంతమంది మిగతా పార్టీల గుర్తులతోనైన పోటీ చేసి గె లిచి తమ సత్తా చాటాలనే ఆలోచన కూడా చేస్తున్న ట్లు తమ సమీప బంధువులు, శ్రేయోభిలాషుల తో వారి మనసులో మాటలను పంచుకుంటున్నారు.




## సురక్షిత తాగునీరు అందించే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామాల్లో ప్రజలకు నిరంతరం సురక్షిత త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక నీటి సరఫరా డ్రైవ్ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పంచాయితీరాజ్, ఆర్‌డబ్లుఎస్, మిషన్ భగీరథ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు ఫిబ్రవరి 1 నుండి 20 వరకు జరిగే స్పెషల్ డ్రైవ్‌లో ఆర్‌డబ్లుఎస్, మిషన్ భగీరథ, పంచాయితీరాజ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి నివేధిక సమర్పించాలని సూచించారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గ్రామాల వారీగా బోర్డుల, హ్యాండ్‌పంపులు, ఓవర్ హెడ్ ట్యాంకులు, పైపులైన్లు పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. పనిచేయని మోటార్లు, లీకేజీలు, బ్రేక్‌డౌన్లను వెంటనే గుర్తించి తక్షణమే మరమ్మత్తులు చేయాలని చెప్పారు. తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచి తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలని, ట్యాంక్‌ల చుట్టూ పరిశుభ్రం చేయాలని, అవసరమైన చోట అదనపు బోర్లు, ప్రత్యామ్నాయ నీటి వనరులు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. జలసేవ ఆకలనం ద్వారా ప్రజలకు అందుతున్న త్రాగునీటి సేవల స్థితిగతుల పరిశీలన నీటి సరఫరా పరిమాణం, నాణ్యత, నిరంతరతపై అంచనా జలసేవల్లో లోపాలు, అవసరాలను గ్రామస్థాయిలో విలేజ్ వాటర్ అండ్ శానిటేషన్ కమిటి ఏర్పాటు చేసి గుర్తించి అట్టి విషయాలను జెజెఎం పంచాయితీ రాజ్ డాష్ బోర్డు నందు అప్లోడ్ చేయాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్పి సిఈఓ శిరీష, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, ఆర్‌డబ్లుఎస్ అధికారి శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఓలు, డిఈలు, ఏఈలు, ఎంపిఓలు హాజరయ్యారు.

# ద్వితీయ శ్రేణి నాయకుల్ని కాదన్నామా...

## ఆశావహుల్లో అంతర్మథనం...!

**ప్రజాపక్షం/హాలియా:** దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించేనా అన్న చందంగా మారింది... మున్సిపాలిటీలో అధికార పార్టీ నుంచి కౌన్సిలర్ గా పోటీ చేయాలనుకునే అభ్యర్థుల పరిస్థితి. రిజర్వేషన్ల పుణ్యమా అని ఊహించని వారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభిస్తుంది. ఈ క్రమంలోనే హాలియా మున్సిపాలిటీలో అధికార పార్టీ నుంచి కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు అభ్యర్థుల జాబితా రోజురోజుకు పెరుగుతుంది. ఇదంతా పార్టీ అధికారంలో ఉండడమే అందుకు కారణమని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. హాలియా మున్సిపాలిటీలో 12 వార్డులు ఉన్నాయి. ఇందులో ఆరు జనరల్ స్థానాలు కాగా రెండు ఎస్సీలు, ఒకటి ఎస్టీ, మూడు బీసీలకు రిజర్వ్ అయ్యాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో ఇబ్రహీంపేట ప్రస్తుత గ్రామపంచాయతీ మున్సిపాలిటీలో భాగంగా ఉండేది. కానీ దానిని గ్రామపంచాయతీ ఎన్నికలకు ముందే ప్రత్యేక పంచాయతీ కావడంతో అది హాలియా మున్సిపల్ నుండి వేరైంది. గతంలో హాలియాలో 10 వార్డులు ఉండగా ప్రస్తుతం 12 వార్డులుగా చేశారు. మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ కూడా ప్రకటించారు. ఈ క్రమంలో బుధవారం నామినేషన్లకు మొదటి రోజు కూడా పూర్తయింది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు అభ్యర్థుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రతి వార్డు నుంచి నాలుగురు అభ్యర్థులు తగ్గకుండా పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఆది నాయకుని కంటే ద్వితీయ శ్రేణి నాయకులనే ప్రసన్నం చేసుకోవడంలో ఆశావాహులు పోటీ పడుతున్నారు. ద్వితీయశ్రేణి నాయకులు చెబితే వినే అభ్యర్థులకే టికెట్లు ఇస్తారనే భావన కిందిస్థాయి నాయకుల్లో బలంగా నాటుకుపోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం టికెట్లు ఆశిస్తున్న అభ్యర్థుల్లో కొత్త ఉత్కంఠ మొదలైంది. తాము ఏనాడైనా ద్వితీయ శ్రేణి నాయకులు చెప్పిన మాట విన్నామా లేదా? వారిని ఎదిరించి ఏనాడైనా తక్కువ చేసి మాట్లాడామా! అని ఆత్మ విమర్శ చేసుకుంటున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన కొంతమంది నాయకులు, అధికార పార్టీలో ఉన్న మరి కొంతమంది ఆశావాహులు కూడా ఈ మాటల్ని నెమరేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు రెండు పడవలపై కాలు వేసి స్వారీ చేసిన నాయకులు కూడా ప్రస్తుతం ఆత్మ విమర్శ చేసుకుంటున్నారు. హాలియా మున్సిపాల్ చైర్మన్ పీఠం జనరల్ స్థానానికి రిజర్వ్ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న నాయకులు కూడా తాను చెబితే వినే అభ్యర్థులకే కౌన్సిలర్ టికెట్లు ఇప్పించుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు ద్వితీయ శ్రేణి నాయకుల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అయితే ఈ పరిస్థితి ప్రస్తుత ప్రతిపక్ష పార్టీలో లేకపోవడం గమనార్హం. ఈ పరిస్థితి ప్రస్తుతం అధికార పార్టీలో మాత్రమే ఉంది. టికెట్ల ఆశిస్తున్న అభ్యర్థులు తాము చేసిన చిన్నచిన్న పొరపాట్లను నెమరేసుకుంటున్నారు. నామినేషన్లు వేసేందుకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో ఆశావాహులు ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. అయితే రెండు రోజుల క్రితం ఇన్చార్జ్ మంత్రితో జరిగిన సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి టికెట్లు ఆశిస్తున్న నాయకులు పైరవీ కారుల చుట్టూ ప్రదర్శనలు చేసిన ప్రయోజనం శూన్యమని నిర్మొహమాటంగా చెప్పారు. అభ్యర్థులపై సర్వేలు చేశామని ఆ సర్వేలలో మంచి మార్కులు సాధించిన వారికే టికెట్లు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. దీంతో ఆశావాహుల ఆశలు అడకత్తెరలో పోక చెక్కలా మారింది. ఏదేమైనా ఆయా పార్టీల నాయకులు తమ అభ్యర్థులను నేడు ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.




## నామినేషన్ కేంద్రం తనిఖీ

**ప్రజాపక్షం/కోదాడ:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ మొదటి రోజు కావడంతో కోదాడ పురపాలక కార్యాలయంలోని కేంద్రాలను ఆర్డీవో సూర్యనారాయణ, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి లు బుధవారం సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ తీరు, బందోబస్తు ఏర్పాట్లను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అభ్యర్థులు అనుచరుల తాకిడి పెరిగే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ పత్రాలను క్షుణంగా పరిశీలించాలని, అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అదేశించారు. వారి వెంట కోదాడ సిఐ శివ శంకర్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తహసిల్దార్ వాజీద్‌అలీ పాల్గొన్నారు.

## ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 28వ వార్డు మాదవరాయినిగూడెం, మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామాలలో హుజూర్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శీతకాల ప్రత్యేక శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఇంఛార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ వాలంటీర్లనుద్దేశించి మాట్లాడారు. సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర గొప్పదని, వారం రోజుల పాటు జరిగిన క్యాంపులో ఓటు హక్కు, ఎయిడ్స్ మీద అవగాహన తదితర అంశాలపై గ్రామ ప్రజలను చైతన్య చేయడాన్ని ప్రశంసించారు. క్రీడలు, వివిధ సాంస్కృతిక పోటీలలో గెలుపొందిన వాలంటీర్లకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం అధికారులు బాలరాజు, నాగార్జున, హెచ్ ఎంబి చంద్యా కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మండలంలోని ప్రజల భూ సమస్యలు పరిష్కరించడమే తమ లక్ష్యమని తహసిల్దార్ బండ కవిత అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ తహసిల్దార్ బండ కవితను, సర్వేయర్ మంజుల లను కార్యాలయ సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు. మండలంలో తహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా ఉత్తమ తహసిల్దార్, ఉత్తమ సర్వేయర్లుగా అవార్డులు తీసుకున్న విషయం విధితమే.



## బిఆర్ఎస్ గెలిస్తేనే కోదాడ పట్టణాభివృద్ధి

**కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్**



ప్రజాపక్షం/కోదాడ: బిఆర్ఎస్ హయంలో కోదాడ పట్టణం సర్వతోముఖాభివృద్ధి చెందిందని మున్సిపల్ శాఖ మంత్రిగా కెటిఆర్ మంజూరు చేసిన కోట్ల రూపాయల నిధులతో పట్టణం సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడిందని, రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇక్కడ తట్టెడు మట్టికూడా పోయలేదని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విమర్శించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వీధులలో చెత్త పేరుకుపోయి అస్తవ్యస్తంగా ఉందని, పారిశుద్ధ్య లోపంతో ప్రజలు రోగాల బారీన పడుతున్నారని అన్నారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం రోడ్ల విస్తరణ, హరితహారంతో పాటు మరిన్ని అభివృద్ధి పనులతో కళకళలాడిందని, నేడు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందని అన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ఎస్‌కె నయీం, సీనియర్ నాయకులు పయిడిమర్రి సత్యబాబు, మామిడి రామారావు, తుమ్మలపల్లి భాస్కర్, గట్ల కోటేశ్వరరావు, కందుల చంద్రశేఖర్, అల్వాల వెంకట్, సుందర్‌బాబు, మేదర లలిత పాల్గొన్నారు.

## సిపిఐని మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించాలి




బూర వెంకటేశ్వర్లు పిలుపు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా ఉద్యమాలు చేసినటువంటి సిపిఐ పార్టీని ఆదరించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లను ప్రజానీకానికి పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో జరిగిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలోని అనేక వార్డులలో నిరంతరం స్థానిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించిందని, పట్టణంలో పేదలకు డబుల్ బెడ్ రూములు, అర్హులైన పేదలందరికి రేషన్ కార్డులు, వృద్ధులకు ఫించన్లు ఇవ్వాలని పోరాటాలు చేసింది సిపిఐ అని గుర్తు చేశారు. ప్రశ్నించే గొంతుగా ప్రజలపక్షాన నిలబడటానికి సిపిఐ మున్సిపల్ ఎన్నికల్లో 3 వార్డులలో కలిసి వచ్చే పార్టీలతో పొత్తులో భాగంగా పోటీ చేస్తుందని అన్నారు. ప్రజా ఉద్యమాల రథసారధిగా సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, ఖమ్మంపాటి రాము, రేగటి లింగయ్య, ఎండి పాషా, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, ఐత రాజు లింగయ్య పాల్గొన్నారు.

## గ్రామాల్లో లొకేషన్స్ గుర్తించకుండా, ఎస్టిమేషన్స్ లేకుండా అభివృద్ధి పనులు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబందించి లొకేషన్స్ గుర్తించకుండా, ఎస్టిమేషన్స్ లేకుండా గ్రామ సర్పంచ్‌ను కనీసం సంప్రదించకుండా వారి ఇష్టారీతిన పనులు చేస్తున్నారని భువనగిరి మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు జక్క రాఘవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు తెలిపారు. బుధవారం భువనగిరిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యలయంలో భువనగిరి మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులు జక్క రాఘవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్‌ఎండిఏ నిధులు 9 కోట్లు భువనగిరి మండలం రూరల్ గ్రామాల అభివృద్ధికి మంజూరు కావడం జరిగిందన్నారు. ఈ నిధులకు సంబందించిన పనులను భువనగిరి ఎమ్మెల్యే ఒకే కాంట్రాక్టర్‌కు మొత్తం పనులను అప్పగించడం జరిగిందన్నారు. అతికం లక్ష్మి నారాయణగౌడ్, గోద శ్రీనివాస్ గౌడ్, ర్యాకల శ్రీనివాస్, నీల ఓంప్రకాష్ గౌడ్, పడాల వెంకటేష్, నాగేల్లి రమేష్ గౌడ్, కంకాల కిష్టయ్య, కొండూరి సత్యనారాయణ, కొమ్మగాని నర్సింహా పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహనతో సమస్యలు పరిష్కారం




**ప్రజాపక్షం/మోతె :** ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహనతో సమస్యలన్ని పరిష్కారం అవుతాయని ఎంఇఓ కె గోపాల్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంతోపాటు సర్వారం, కూడలి గ్రామాలలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పిల్లలకు ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారంగా ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 వయస్సు వచ్చిన తరువాతే పెళ్ళిలు చేయాలని కోరారు. లేదంటే వయస్సు లేని పిల్లల పెళ్లిల్లో ఎవరు సహకరించినా శిక్ష తప్పదని హెచ్చరించారు. తల్లి దండ్రులు మైనర్ డ్రైవింగ్‌కు సహకరిస్తే జైలు పాలుకాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సర్వారం సర్పంచ్ మూడు నగేష్, కూడలి, మోతె ఉప సర్పంచులు సంధ్య ఉపేందర్ రెడ్డి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటి వాలెంటీర్స్ జటంగి సమనయ్య, గుద్దేటి వెంకన్న, పల్లెల లక్ష్మణ్, ఎస్ కృష్ణ వేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటాం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్‌పి) మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని టిఆర్‌పి రాష్ట్ర కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. బుధవారం నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని పలు వార్డులకు చెందిన యువకులను ఆయా పార్టీలకు రాజీనామా చేసి టిఆర్‌పిలో చేరగా ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సారి సూర్యాపేట మున్సిపాలిటి ఎన్నికల్లో ప్రజలందరూ తెలంగాణ రాజ్యాధికార పార్టీకి చెందిన కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జనరల్ స్థానమైన సూర్యాపేట మున్సిపాలిటిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పరస్పరం కుమ్మక్కై డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి స్థానం కైవసం చేసుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో 78 ఏండ్ల తర్వాత మెజార్టీ రాష్ట్ర ప్రజల తరుపున ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల పక్షాన ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 18 మున్సిపాలిటిలు, నల్లగొండ కార్పోరేషన్‌లో కత్తెర గుర్తుపై పోటీ చేస్తున్న సబ్బండ వర్గాల ప్రతినిధులను ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజా గౌడ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల, ప్రధాన కార్యదర్శి నారాయణదాస్ కవిత పాల్గొన్నారు

## బొల్లం వ్యాఖ్యలపై ఎస్‌పికి ఫిర్యాదు



**ప్రజాపక్షం/మోతె :** ఇటీవల కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా మోతె మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌లు మాజీ ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్‌పి కె నరసింహకు బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎస్‌పి నరసింహ కోదాడ డిఎస్‌పితో విచారణ చేయిస్తానని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి బానోతు మాతృనాయక్, సింగిల్ విండో మాజీ చైర్మన్ నూకల మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, సర్పంచులు తేజావత్ ఆండాలు, భూక్య ఉప్పయ్య, భూక్య మల్సూర్, హలావత్ స్వామి, గోవర్థన్, బిక్కు నాయక్ పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** సిఎం కప్ క్రీడలో భాగంగా మోటకొండూర్ మండల స్థాయి సిఎం కప్ క్రీడో త్సవాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోటకొండూర్ ఆవరణలో నేటి నుండి జరుగుతాయని, క్రీడలలో మూడు క్లస్టర్లలో (మోటకొండూర్, చాడ, అమ్మనబోల్) క్లస్టర్లలో కబడ్డీ, వాలిబాల్, ఖోఖో, యోగా, చెస్, కరాటే, అథ్లెటిక్స్‌లో ఎంపికైన క్రీడాకారులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని ఎంపిడిఓ ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి, ఇంచార్జి ప్రధానోపా ధ్యాయులు కలకోట రాజగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ నాతి మల్లేశం, కె.నాగరాజు పాల్గొన్నారు.

## బిజెపి వలిగొండ మండల కమిటీ

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల బిజెపి పార్టీ అధ్యక్షుడిగా బోళ్ల సుదర్శన్ మండల పూర్తి కమిటీని పత్రిక ప్రకటన విడుదల చేశారు. బిజెపి మండల ఉపాధ్యక్షులుగా మందుల నాగరాజు, మందడి రంజిత్ రెడ్డి, రేగురి అమరేందర్ బాబు, రమేష్, నక్క సందీప్ రెడ్డి, దెయ్యాల మమత, వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా లోడే లింగస్వామి గౌడ్, గంగదారి దయాకర్, పిన్నింటి నరేందర్ రెడ్డి, కార్యదర్శులుగా ఎదురుగట్ల వెంకటేశం, కీర్తి స్వప్న వెంకటేశం, పెద్ద బోయిన శీను, గోగు మహేష్, బంధారపు లింగస్వామి, కోశాధికారిగా వట్టిపల్లి శ్రీకాంతులను నియమిస్తున్నట్లు ప్రకటనలో తెలియజేశారు.



## కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కాంగ్రెస్ నాయకులు అంబటి కృష్ణ, అడావత్ అశోక్‌నాయక్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని 6వ వార్డుకు ఇందిరమ్మ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు పోచంరెడ్డి మోహన్‌రెడ్డి, కన్నెకంటి నవీన్, గడ్డం గోపి, దూదిగాని పిచ్చయ్యలు ఆ పార్టీకి రాజీనామా చేసి శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ కండువా కప్పుకోని పార్టీలో చేరారు. వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు అహ్మద్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

## ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/కోదాడ:** సమాజంలో అట్టడుగు, అణగారిన వర్గాల అభివృద్ధికి ఈడబ్ల్యూఎస్ సోసైటీ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంస్థ వైస్ చైర్మన్ శ్రీనివాస్ బహదూర్ తెలిపారు. బుధవారం కోదాడ పట్టణంలోని ఇటీవల మృతి చెందిన దళిత యువకుడు కర్ల రాజేష్ నివాసానికి సోసైటీ వ్యవస్థాపకులు నాగర్‌కర్నూలు ఎంపి మల్లు రవి అదేశాల మేరకు రాజేష్ తల్లి లలితమ్మకు తక్షణ సాయం కింద లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ కడమంచి సహదేవ్, ఈసి మెంబర్లు మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, నరేష్, స్థానిక నాయకులు కర్ల రాజేష్, గంధం యాదగిరి, కుడుముల లక్ష్మి నారాయణ, కాంపాటి పుల్లయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠ భూమిపూజ



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలోని తేర్యాల బస్టాండ్ ఆవరణంలో చత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపన చెయదానికి తేర్యాల సర్పంచ్ మంత్రి స్వామి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దాతల సహకారంతో శివాజీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు, దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాజ మోహన్, పంచాయతీ కార్యదర్శి ఎ.ఉమేష్, వార్డ్ సభ్యులు చామల సక్కుబాయి, కోలను పాక రమ్య, పల్లపు కనకరాజు, చిన్నం రమేశ్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు డి.సికిందర్ రెడ్డి, మరాటి మల్లయ్య, చిన్నం రాములు, రేగు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** గుడిమల్కాపురం సబ్‌స్టేషన్ నందు సోలార్ ప్లాంట్ కొరకు కొత్తగా 11కెవి లైన్ వేస్తున్న సందర్భంగా 11కెవి తమ్మారం ఫీడర్ ప్రాజెక్టు వైపు, 11కెవి ప్రాజెక్టు ఫీడర్ నెమలిపురికాలనీ వైపు గురువారం (నేడు) మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్ శాఖ ఎఇ సైదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

# అరుదైన అకాలేసియా కార్డియా వ్యాధికి యశోద వైద్యుల అరుదైన చికిత్స

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అరుదైన అకాలేసియా కార్డియా వ్యాధికి హైదరాబాద్ మలక్‌పేట యశోధ ఆసుపత్రి వైద్యులు అరుదైన చికిత్సను చేసి రోగి ప్రాణాలను కాపాడారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రలాజిస్టు డాక్టర్ ఎన్ కిషన్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ చిదర శ్రీనివాస్‌లు వెల్లడించారు. ఆహారం మింగలేని అరుదైన వ్యాధి అయిన అకాలేసియా కార్డియాతో బాధపడుతున్న సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన 63 ఏళ్ల మహిళకు అత్యాధునిక వైద్య విధానంతో ఆపరేషన్ లేకుండా చికిత్స చేసినట్లు చెప్పారు. గత కొంతకాలంగా ఆహారం మింగడంలో తీవ్ర ఇబ్బందులు, ఛాతీలో నొప్పి బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆసుపత్రిలో చేరినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు ప్రత్యేక ఎండోస్కోపిక్ మూల్యాంకనంలో రోగికి టైప్ 1 అకలాసియా కార్డియాగా నిర్ధారణ కావడంతో ఆధునిక పిఓఇఎమ్ (పర్ ఓరల్ ఎండోస్కోపిక్ మయోటోమి) అనే అత్యా




ధునిక ఎండోస్కోపిక్ చికిత్సను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ విధానం ద్వారా శస్త్ర చికిత్స లేకుండా అన్నవాహిక కండరాల ఒత్తిడిని తగ్గించి, ఆహారం సజావుగా లోపలికి వెళ్లేలా చేసినట్లు చెప్పారు. చికిత్స అనంతరం రోగి ఆహారం మింగగలగడం పూర్తిగా మెరుగుపడిందని వివరించారు. ఎలాంటి సంక్లిష్టతలు లేకుండా చికిత్స పూర్తయ్యిందని, రోగి ఆరోగ్యం వేగంగా కోలుకుందని పేర్కొన్నారు. యశోదా హాస్పటల్‌లో ఉన్న అత్యాధునిక ఎండోస్కోపిక్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య బృందం సమగ్ర వైద్య నిర్వహణ వల్లే ఈ క్లిష్టమైన చికిత్స విజయవంతమైందని వెల్లడించారు.

## దిగ్విజయంగా సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన

**ప్రజాపక్షం/చింతలపాలెం :** సత్యం, ధర్మం, త్యాగం వంటి విలువలను ప్రజలకు చేరువ చేసిన సత్యహరిశ్చంద్ర నాటకం లాంటి సాంప్రదాయ కళలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని చింతలపాలెం సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గొప్ప సాంప్రదాయ నాటక కళకు ప్రతీకగా నిలిచిన, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ద్వితీయ కళ్యాణ మహోత్సవ సందర్భంగా సత్యహరిచంద్ర నాటకాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కాలక్రమంలో ఇటువంటి గొప్ప నాటక కళలు కనుమరుగవుతున్న నేపథ్యంలో, వీటిని కేవలం మహాశివరాత్రి వంటి పర్వదినాలకు మాత్రమే పరిమితం కాకూడదన్నారు. నందిరెడ్డి ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత యువత పాశ్చాత్య సంస్కృతి వైపు ఆకర్షితుమవుతున్న తరుణంలో భారతీయ సంప్రదాయాలు, నైతిక విలువలను తెలియజేసి నాటకాలు, జానపద కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శృతిలయ నాట్య కళామండలి సంస్థ అధ్యక్షులు మాధవరపు జయశంకర్, ప్రధాన కార్యదర్శి నెమ్మోజు గురుబ్రహ్మాచారి, మండల కళాకారులు, సిపిఎం నాయకులు జంగాల పుల్లయ్య, దొండపాటి వెంకటరెడ్డి, చింతిరాల సురేందర్ పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలకు శాశ్వతంగా పరిష్కరించేందుకు చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు బుధవారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో విద్యుత్ మౌలిక సదుపాయాలు కీలకం అని , సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా రైతులు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనలో ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కాళీ పద్మ వెంకన్న, మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి, యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, విద్యుత్ శాఖ డిఈ వెంకటేశ్వర్లు, ఏడి బాలునాయక్, మండల విద్యుత్ ఏఈ నర్సింహా, కన్‌స్ట్రక్షన్ టెక్నికల్ డిఈ సుదీర్‌కుమార్, ఏడి రవీందర్, ఏఈ అనిల్, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## పండువగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

**ప్రజాపక్షం/గుండాల;** యాద్రాది భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామంలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం గుడి నిర్మాణకర్త సరబోజు చొక్కయచారి ఆధ్వర్యంలో వేద పండితులు సురేష్, సుధీర్ కుమార్ చార్యులు, వంశీ కృష్ణమాచార్యులు, విశాలాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్య వెంకటేశ్వర స్వామి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా భక్తులు తెల్లవారు జామునే ఆలయానికి బారులు తీరారు. కళ్యాణం



అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అన్నదాత శేషగిరిరావు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కవిత శ్రీను, సునిత, రమకృష్ణ, దేవాలయ చైర్మన్ కృష్ణమూర్తి, వరలక్ష్మి బక్కయ్య, శేషగిరిరావు, శ్రీను, బాలరాజు, బాలకృష్ణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## సాలయ్య ఆశయాలు సాధిద్దాం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలం జనగాం గ్రామంలో సీపీఐ నాయకుడు అమరజీవి శనిగల సాలయ్య 17వ వర్ధంతి ఆయన స్థూపం వద్ద చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు కొండూరు స్వామి మాట్లాడుతూ గీతా పనివారల హక్కుల కోసం, ఎర్ర జెండా నీడన గులాం రసూల్ నాయకత్వాన పనిచేశారని గుర్తు చేశారు. అనేక ఆటు పోట్లను ఎదుర్కొని ఎర్రజెండను నిలబెట్టారని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐవైయఫ్ నాయకులు వెంకటేశం, కిరణ్, మహేష్, వంశీ, వార్డు సభ్యుడు కొండూరు రవితేజ, సీపీఐ గ్రామ శాఖ నాయకులు సాలయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మండల సర్పంచ్ ఫోరం మండలి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక

**ప్రజాపక్షం/చింతలపాలెం :** కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి, కిష్టాపురం గ్రామ శాఖ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల్లో మంచిపేరు సంపాదించి, సర్పంచ్‌గా ప్రజల మద్ధతుతో ఎన్నికై ఇప్పుడు చింతలపాలెం మండల సర్పంచుల ఫోరం మండలి ఉపాధ్యక్షులుగా షేక్ అమీరున్ బి దాదబుడే ఎన్నిక కావడం నిజంగా అభినందనీయమని మండల అధ్యక్షులు నరాల కొండారెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ మున్నా అన్నారు. సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా చెన్నకేశి వెంకయ్య (దొండపాడు), ప్రధాన కార్యదర్శిగా కొండపల్లి సుందర్రావు (వజినేపల్లి), ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి మరింత బలంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకల శ్రీనివాసరెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, పలు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొని అభినందించారు.

## బిసి రిజర్వేషన్ అంశం ముగింపు మోసగించి ఎన్నికల్లో ముందుకు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీలను మభ్యపెట్టి రిజర్వేషన్లు కల్పించకుండా ఉద్యోగాల్లో, రాజకీయాల్లో అవకాశాలు కల్పించకుండా నేడు మున్సిపల్ ఎన్నికలు సైతం నిర్వహిస్తున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మోసపూరిత రాజకీయ అవసరాల కోసం బీసీలను ప్రభుత్వం వాడుకోని బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నట్లు మభ్యపెట్టి నిజంగా కొట్లాడే వారిని ఉద్యమాన్ని నీరుగార్చి బీసీ వాదం బలహీన పరచడానికి చేసిన కుట్ర అని ఎద్దేవా చేశారు. బహుజనుల ద్వారా ఇప్పటికైనా ఈ మోసాన్ని గ్రహించి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీసీల ఓట్లు పార్టీలకతీతంగా బీసీలకే వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

## పుర పీఠంపై గులాబీ జెండా

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వచ్చే నలె 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో మిర్యాలగూడ పురపీఠంపై గులాబి జెండా ఎగురవేస్తామని మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని రెడ్డికాలనీలోగల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సుందర్‌నగర్ 18వ వార్డు నుంచి సుమారు వంద మంది మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు పార్టీలో చేరిన వారికి గులాబి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెద్ది శ్రీనివాస్‌గౌడ్, గుంజ కొండలు, మల్లేష్, బీఆర్ఎస్ అభ్యర్థి వల్లంపట్ల వినోద్, గుంజ శ్రీనివాస్, చింతకుంట్ల చాంద్, గుడుగుంట్ల కిశోర్ పాల్గొన్నారు.





## కల్యాణ మహోత్సవానికి ఆహ్వానం

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర నగర్‌లో కొలువుదీరిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవత తృతీయ వార్షిక కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని ఆలయ వ్యవస్థాపకులు, నిర్మాణ దాతలు సల్వాది ధనిష్ఠ సుశీలల కుమారుడు సల్వాది నాగరాజు మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గంధం సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సూచిక బోర్డు ఏర్పాటు



ప్రజాపక్షం/మునుగోడు: మండల కేంద్రంలో నార్కట్ పల్లి రోడ్ లో మూలమలుపు వద్ద సరైన సూచిక బోర్డులు లేక నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని మండల కేంద్రానికి చెందిన ఆరో వార్డు మెంబర్ యాసరాని దినేష్ బుధవారం మూలమలుపు వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డును సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా సరైన సూచిక బోర్డులు ఏర్పాటుతో పాటు బ్రేక్ కట్టను ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట ఐదవ వార్డ్ మెంబర్ దొమ్మాటి రాజు, దొమ్మాటి గణేష్,ఏర్కొండ శంకర్ ఉన్నారు.

## ట్యూషన్ సదుపాయం



ప్రజాపక్షం/తుర్కపల్లి : మండలంలోని మోతిరాంతండ గ్రామ పంచాయతీ గోగులగుట్ట గిరిజన తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్ఎస్ ఫౌండేషన్ ఛైర్మెన్ ధరావత్ స్నేహ సురేష్ (పోస్టల్) ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ట్యూషన్ ఏర్పాటు చేయడం జగిందని గ్రామ సర్పంచ్ ధరావత్ కస్మి తెలిపారు. తాండాల్లో చదువుకునే పిల్లలకు చదువులో రాణించాలనే ఉద్దేశ్యంతో తమ స్వంత ఖర్చుతో ట్యూషన్ సదుపాయం కల్పించడం జరిగిందని ఫౌండేషన్ ఛైర్మన్ స్నేహ సురేష్‌లు తెలిపారు.

## సిఎం కప్ క్రీడల సెలక్షన్స్

ప్రజాపక్షం/పాలకవీడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిఎం కప్ 2025/26 క్రీడా పోటీలకు సంబంధించి మండల స్థాయి సెలక్షన్స్ నిర్వహించినట్లు సిఎం కప్ మండల కన్వీనర్, మండల అభివృద్ధి అధికారి జి.లక్ష్మి, సభ్యులు మండల విద్యాధికారి కాటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి మండల స్థాయి కబడ్డీ, వాలీబాల్, అలాగే 31న ఖోఖో, యోగ, అథ్లెటిక్స్ క్రీడల సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు హుజూర్‌నగర్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలో సిఎం కప్ వైబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులకే ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే అర్హత ఉంటుందని అన్నారు.

# రేపటి నుంచి సిఎం కప్ ఆటల పోటీలు

ప్రజాపక్షం/హాలియా: రేపటి నుంచి సీఎం కప్ ఆటల పోటీలు హాలియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో హాలియాలోని వివిధ పాఠశాలల పీఈటీలు,ఎంఈఓతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి సీఎం కప్‌లో కబడ్డీ,ఖోఖో,వాలీబాల్,అథ్లెటిక్స్ తదితర ఆటలపై పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు.ఆటల్లో పాల్గొనే క్రీడాకారులు హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 30వ తేదీన 9 గంటల వరకు హాజరుకావాలని తెలిపారు.ఈ పోటీలపై ఏదైనా సందేహాలు



ఉన్నవారు హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీఈటి వెంకటరమణారెడ్డిని సంప్రదించాలని చెప్పారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గస్థాయి ఆటలలో పాల్గొనేందుకు అర్హులని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి,ఎంఈఓ సీనయ్య,వెంకటరామిరెడ్డి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కమిటీ సమావేశం



ప్రజాపక్షం/తుర్కపల్లి : మండల కేంద్రంలో సేవాలాల్ కమిటీ ఉపాధ్యక్షులు గూగులోత్ హనుమంతు నాయక్, లంబాడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షులు మాలోత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో బంజారా ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సేవాలాల్ నూతన కమిటీకి, ఇటీవల గెలుపొందిన నూతన సర్పంచులు, ఉప సర్పంచులకు తుర్కపల్లి మండల కేంద్రంలోని జెఎం ఫంక్షన్ హాల్లో 30వ తేదీన సన్మాన కార్యక్రమం ఉంటుందని, ప్రతి తండా నుండి ప్రస్తుతం గెలిచిన సర్పంచులు, ఉప సర్పంచులు వార్డు మెంబర్లు వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల అధ్యక్షులు, నుంచి పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూక్య నర్సింహులు నాయక్, భూక్యా లచిరామ్, బానోతు రమేష్, మాడోత్ సుధాకర్ నాయక్, గూగులోత్ చిన్న, భూక్యా నరేందర్, గూగులోత్ వెంకటేష్, రాజ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సర్వే చేసి దేవాలయ భూములను కాపాడాలని వినతి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామంలోని శ్రీ రాజాగోపాలస్వామి ఆలయ భూములను రీసర్వే చేసి హద్దులు నాటి కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరుతూ దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ కే.భాస్కరరావుకు ఆ దేవాలయ చైర్మన్ చింతల రామకృష్ణ బృందం బుధవారం వినతిపత్రాన్ని సమర్పించారు. దేవాలయం పేరు మీద గల 460/1,460/2,460/3 సర్వే నెంబర్లలో భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుని కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరారు. కమిషనర్ వెంటనే స్పందించి రికార్డులను పరిశీలించాలని సర్వే చేసి హద్దులు నాటి నోటీస్ బోర్డు పెట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా అధికారులకు లెటర్ రాసినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ బండి కృష్ణ గౌడ్, ఉప సర్పంచ్ రేవెల్ల అశోక్, పెద్దిరెడ్డి యాదగిరి, గరిస జంగయ్య ఆయన వెంట ఉన్నారు.

# ఇంటిపన్నుల వసూలులో జిల్లాలో మొదటివరుసలో ముల్కలపల్లి

ప్రజాపక్షం/తుర్కపల్లి : ఇంటిపన్నుల వసూలులో తుర్కపల్లి మండలంలోని 33 గ్రామ పంచాయితీల్లో ముల్కలపల్లి, కొనాపూర్ గ్రామాలు 90 శాతం అత్యధిక ఇంటి పన్నులు వసూలుచేసి ఇటు మండలంలోనే కాకుండా, అటు జిల్లాలో మొదటి వరుసలో నిలిచాయని ఎంపిఒ వెంకటేశ్వర్లు తెలుపుతూ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కూరేళ్ల నాగరాజు, కె.సందీప్ రెడ్డి, కారోబార్ శ్రీశైలంలను అభినందించారు. ఇదే తరహాలో మండలంలోని మిగతా 31 గ్రామపంచాయతీ కూడా రెండు గ్రామాల స్పూర్తితో ఇంటిపన్నులు వసూలు చేయాలని తెలిపారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 52 శాతం మాత్రమే పన్నులు వసూలు అయ్యాయని, ప్రతి గ్రామం నిర్దేశించిన లక్ష్యం వంద శాతం పూర్తిచేయాలని సూచించారు. అందుకు అన్ని గ్రామాల సర్పంచ్‌లు పన్నుల వసూళ్లకు సహకరించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపిఒ వెంకటేశ్వర్లు కోరారు.

# బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాపక్షం/నకిరేకల్ : బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ పోట్ల బత్తుల జయమ్మ వెంకటేశం సూచించారు. బుధవారం మండలంలోని నోముల గ్రామంలో అశ్విత స్వచ్ఛంద సంస్థ,జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన కోసం ఏర్పాటుచేసిన బాల్యవివాహాల విముక్తి ప్రచార రథాన్ని ప్రారంభించారు. అనంతరముం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేదుకు స్వచ్ఛంధ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. సమాజంలో మరింత చైతన్యం తెచ్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 100 రోజుల బాల్య వివాహ విముక్తి క్యాంపెన్‌లో భాగంగా రథ



యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ కోఆర్డినేటర్ శోభ రాణి,ధూన్సీ, డిసిపియు సిబ్బంది రేవతి,అంగన్వాడి టీచర్స్ సరిత, అస్మత్ బేగం, ఇంతియాజ్ బేగం, లక్ష్మి, కైరునిసా బేగం పాల్గొన్నారు.



## బక్కయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు యామగాని బక్కయ్య మంగళవారం తాటిచెట్టు పై నుండి ప్రమాదవశాత్తు పడి మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య బుధవారం బక్కయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈసందర్భంగ ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ సినియర్ నాయకులు అండెం సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

## వార్డు అభివృద్ధికి నిరంతరం పని చేశా



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల కోసమే కాకుండా తన సొంత 5వ వార్డు కోసం శక్తివంచన లేకుండా నిరంతరం పనిచేసి అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని సంక్షేమ ఫలాలను వార్డు సభ్యులకు అందించానని వార్డు సభ్యుల సంపూర్ణ మద్దతు తనకే ఉందని ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా మళ్ళీ గెలుస్తానని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ 5వ వార్డు కౌన్సిలర్ చైర్మన్ అభ్యర్థి బాత్క లింగస్వామి ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ తరఫున 5వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మొదటి రోజు బుధవారం ఆయన దాదాపు 300 మంది మద్దతుదారులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశారు. మంగళంపల్లి శ్రీహరి, భోగ కిరణ్, ఇబ్రహీంపట్నం అంజయ్య, గోరుకంటి నరసింహ, ఇబ్రహీం పట్నం రమేష్, వేముల పరమేష్ ఉన్నారు.

## బిఆర్ఎస్‌లో 50 కుటుంబాలు



ప్రజాపక్షం/దేవరకొండ: బిఆర్ఎస్ పార్టీకి ఓటేసి కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దేవరకొండ మునిసిపాలిటి 5వ వార్డుకి చెందిన జక్కుల రాజేశ్వరితో పాటు 50 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీలో మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ దేవరకొండ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జీ పాల్యాయి స్రవంతి, బిల్యానాయక్, కిషన్‌నాయక్, ఆంజనేయులు, శ్రీనివాస్ గౌడ్, రాజు, కృష్ణ, తులసిరాం, అంజిగౌడ్, రమేష్, లోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాపక్షం/నకిరేకల్ : బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు గుండగోని జంగయ్య గౌడ్ తండ్రి గుండగోని సోమయ్య అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్ మృతుని కుటుంబ సభ్యులు గుండగోని సత్యనారాయణ,జంగయ్య గౌడ్,గోవర్ధన్ ను పరామర్శించారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు యల్మకంటి జానయ్య, బాదిని యాదయ్య,బాదిని సోమయ్య,అలగడప సైదులు,ఖాసీం, మాచర్ల తిరుమలేష్, బీమనబోయిన యాదగిరి పాల్గొన్నారు.



## చిరుమర్తి పరామర్శ

**ప్రజాపక్షం/నకిరేకల్** : మున్సిపాలిటీ 20వ వార్డ్ గంగాధర ప్రశాంత్ గుండెపోటుతో మృతి చెందగా,నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారి ఇంటికి చేరుకుని పూలమాలతో నివాళి అర్పించారు.అదేవిధంగా 16వ వార్డ్ మహమ్మద్ ఇమ్రాన్ మాతృమూర్తి మృతి చెందగా,ఆయన పార్థీవదేహానికి పూలమాల వేసి కుటుంబాన్నిసానుభూతితో పరామర్శించారు.వారి వెంట నకిరేకల్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్,గుర్రం గణేష్ పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు గ్రామాల అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేయాలని ఎంపీడీవో రాజా త్రివిక్రమ్, ఎమ్మార్వో శ్రీనివాస్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచుల అవగాహన పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు. మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై నిరంతరం సర్పంచులు కృషి చేయాలని సర్పంచ్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు అధికారులు పాల్గొన్నారు.

## నకిరేకల్ సిఐగా హరిబాబు

**ప్రజాపక్షం/నకిరేకల్** : సూర్యాపేట జిల్లా క్రైమ్ బ్రాంచ్ లో విధులు నిర్వహిస్తున్న హరిబాబు నకిరేకల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో నకిరేకల్, శాలిగౌరారం,అడవిదేవులపల్లి ప్రాంతాల్లో ఎస్ఐ గాసేవలందించారు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లా క్రైమ్ బ్రాంచ్ లో పనిచేస్తున్న ఆయన, త్వరలో నకిరేకల్ సీఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ బత్తిని యాదగిరికి ఇటీవల రోడ్డు యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలు కావడంతో అతడు పనిచేయలేని స్థితి ఏర్పడడంతో వారి కుటుంబ జీవనం చికిత్స కోసం ఏజేఆర్ ఫౌండేషన్ ద్వారా కుటుంబానికి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు.

## భూమిపూజ

**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : మండలంలోని తుంకుట గ్రామంలో బుధవారం నూతన అంగన్వాడి భవనానికి సర్పంచ్ డోకురి ఐలయ్య భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు.

## కంపచెట్లను తొలగింపు

**ప్రజాపక్షం/వలిగొండ :** ఆరూరు గ్రామపంచాయతీ పరిధిలో జంగారెడ్డిపల్లి వరకు దుర్గమ్మ గుడి నుండి అరూర్ వరకు రోడ్డు ఇరువైపులా కంప చెట్లను రోడ్డు గుంతలను మట్టితో జెసిబి డోజర్‌తో మరమ్మతులు చేయించారు. రోడ్డు ప్రక్కన చెట్ల పొదలను తొలగించినందుకు రైతులు అనంతరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



# భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని బిఆర్ఎస్ కైవసం చేసుకోవాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ బండ నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ పార్టీతో సీపీఎం పార్టీ పొత్తు పై భువనగిరి మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ బండ నరేందర్ రెడ్డి, భువనగిరి మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ భువనగిరి నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డితో జరిగిన సమావేశంలో భువనగిరి మున్సిపాలిటీలో సీపీఎం పార్టీకి 6వ వార్డు కేటాయించడం జరిగింది. 35 వార్డులలో సీపీఎం పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా 6వ వార్డు అభ్యర్థిగా



సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు కొలుపుల వివేక్‌ని బిఆర్ఎస్ పార్టీ తాజా మాజీ కౌన్సిలర్ తుమ్మల పాండు బలపరిచారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షులు కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య పాల్గొన్నారు.

## ఈ శిక్షణ ద్వారా ఆహార నిర్వహకుల నైపుణ్యాలు మెరుగు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజలకు సురక్షితమైన ఆహారం అందించడంలో హోటళ్లు,రెస్టారెంట్లు పాత్ర అత్యంత కీలకమని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి అన్నారు.పజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా నల్లగొండ జిల్లా ఆహార పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఫోస్టాక్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ ద్వారా పట్టణంలోని కృతుంగా రెస్టారెంట్ ప్రాంగణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆహార సంస్థ ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి,ప్రజలకు మరింత సురక్షితమైన ఆహారం అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పరిశుభ్రత,వ్యక్తిగత



శుభ్రత,ఆహార నిల్వ విధానాలు,క్రాస్ కంటామినేషన్ నివారణ,శుభ్రమైన వంటగది నిర్వహణ,ఆహార భద్రతా ప్రమాణాల పాటింపు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.రోజువారీ పనిలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను ప్రాక్టికల్ ఉదాహరణలతో ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివ శంకర్ రెడ్డి,గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ పి స్వాతి పాల్గొన్నారు.

## ఫ్లెక్సీల తొలగింపు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల కోడ్ రాకముందే పార్టీల అభ్యర్థిత్వం ప్రకటించక ముందే మిర్యాలగూడలో కొంతమంది ఆశావాహులు ఫ్లెక్సీలు పెట్టి ప్రచారం ప్రారంభించగా మున్సిపల్ అధికారులు బుధవారం ఫ్లెక్సీలు తొలగించారు. ఎన్నికల కోడ్ మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి అమలులోకి రాగా ముందే కొన్ని వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులమని తమను గెలిపించాలని ఆయా పార్టీల ముఖ్యుల ఫోటోలతో ఎన్నికల అధికారుల అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, అది కూడా విద్యుత్ శాఖ స్తంబాలపై పెట్టగా మున్సిపల్ ఎన్నికల ఎంసీసీ టీం గమనించి బుధవారం తొలగించారు. అదేవిధంగా కొన్ని పార్టీల ఆశావాహులైన కొంత మంది ఆయా పార్టీల అభ్యర్థులు వారం, పదిహేను రోజుల క్రితమే ఓటర్లకు గిఫ్టులు అందచేశారు. ఈ




సందర్భంగా కమీషనర్ జి.శ్రీనివాస్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పరచారం ప్రచారం చేసినా ఫ్లెక్సీలు పెట్టినా, గోడలపై రాతలు రాసిని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు పొంది ఏదైనా ప్రచారం చేసుకోవాలని ఆయన అన్నారు.

## సిఎం కప్ క్రీడలను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల స్థాయి చీఫ్ మినిస్టర్ క్రీడలను బుధవారం ఎంపీడీవో రామకృష్ణ శర్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసి అంతర్జాతీయ స్థాయికి చేర్చాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీఫ్ మినిస్టర్ క్రీడలను చేపట్టిందని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల స్థాయిలో కబడ్డీ,కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్, క్రీడలను ఈనెల 28 నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మండలంలోని యువత, పాఠశాల విద్యార్థులు, మండల స్థాయిలో జరిగే క్రీడలలో ప్రతిభ కనపరిచి నియోజకవర్గస్థాయిలో జరిగే సీఎం కప్ క్రీడలకు ఎంపిక కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో




ఎంఈఓ మల్లికార్జునరావు,స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్,మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి,వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సమ్మక్క-సారలమ్మ జాతర ప్రారంభం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో సమ్మక్కసారలమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. ప్రతి రెండేండ్లకోసారి జరిగే ఈ జాతర మేడారం సమ్మక్క సారక్క జాతర జరిగే సమయంలోనే ఈ జాతర జరగడం ఆనవాయితీగా వస్తుంది. మండలం నుండే కాకుండా సూర్యాపేట జిల్లా నలుమూలల నుండి వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుంది. అమ్మవారికి బోనాలు చెల్లించుకోవడంతోపాటు నిలువెత్తు బంగారం (బెల్లం)తో తులాభారం వేసి అమ్మవారికి భక్తులు సమర్పించారు. దేవాలయ కమిటి చైర్మన్ బండి మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ నాతాల వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్ళారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి



**ప్రజాపక్షం/దేవరకొండ;** ప్రతి ఒక్కరూ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలి అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం డిండి మండలం దాసరి నెమలిపురం శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి 39వ బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రవీంద్రకుమార్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రఫీయ బషీర్, దేవాలయ కమిటి సభ్యులు కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, దాసరి నెమలిపూర్ బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు బాలయ్యగౌడ్, వార్డు సభ్యులు వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ మార్పుకు సైన్సే ఆధారం



**ప్రజాపక్షం/నకిరేకల్** : ప్రపంచ గతిని మార్చగల శక్తి సైన్స్‌కే ఉందని, విద్యార్థులు సైన్స్ విషయంపై మరింత ఆసక్తి పెంచుకోవాలని నకిరేకల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కే. రాములు అన్నారు. బుధవారం నకిరేకల్ ఉన్నత పాఠశాలలో ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతిభా పరీక్షలు విద్యార్థుల ప్రతిభను, నైపుణ్యాలను అంచనా వేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య,ఏ. సత్యవతి,ఎస్.నాగేంద్రప్రసాద్,సిహెచ్. ఉపేందర్,సిహెచ్. అండాలు,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల కేంద్రమైన గరిడేపల్లిలో మండల స్థాయి సిఎం కప్ క్రీడలను బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల కమిటి చైర్మన్ ఎంపిడివో ఆర్. సరోజ లాంచనంగా ప్రారంభించారు. ఈ మండలస్థాయి క్రీడాపోటీలలో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటి కో చైర్మన్ మండల విద్యాధికారి చత్రునాయక్, కమిటి సభ్యులు తహసిల్దార్ ఎన్.స్రవంతి, ఫిజికల్ డైరెక్టర్ బి. హుస్సేన్, అంబేద్కర్ పాల్గొన్నారు.



## చెక్కు పంపిణీ

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని కొండపాక గూడెం గ్రామానికి చెందిన గుండ్లపల్లి సుజాతకి ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్య క్షులు జీడిమెట్ల చలపతి రెడ్డి,మాజీ గ్రామ శాఖ అధ్య క్షులు మామిడి సుధాకర్ రెడ్డి,నాయకులు తిరుగుడు నాగేష్,జిల్లా యూత్ కార్యదర్శి తిరుగుడు రవి,మాజీ ఉపసర్పంచ్ సామ అంజిరెడ్డి పాల్గొన్నారు.

## బహుమతుల ప్రదానం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** నార్కెట్‌పల్లి పట్టణ కేంద్రంలో ఇటీవల నిర్వహించిన వాలీబాల్ టోర్నమెం ట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజే శారు. బుధవారం నిర్వహించిన ఈకార్యక్రమంలో జింకల ఆనంద్‌యశోద కుమారుడు జింకల కార్తిక్ ప్రథమ బహుమతిని నార్కట్‌పల్లి బీసీ కాలనీ టీంకు అందజేశారు.అదేవిధంగా రెండో బహుమతిని పుల్లెంల మహేష్ గౌడ్ ఎల్లారెడ్డిగూడం టీంకు అందజేసి శుభా కాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు పుల్లెంల వెంకట్,పార్టీ యువజన పట్టణ అధ్యక్షులు నడింపల్లి మహేష్ యాదవ్,బొబ్బలి మహేష్ తదితరులు పాల్గొనారు.

## ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీపై ఉపాధ్యాయులకు శిక్షణ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఎర్రగండ్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యా యులకు బుధవారం ఎర్రగడ్లపల్లి పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశంలో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ స్టడీపై రిసోర్స్ పర్సన్ ఉదావత్ లచ్చిరాం,రజినీ కాంత్,స్వప్న,వృత్యంతర శిక్షణ ఇచ్చారు. ఈ సంద ర్భంగా మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్,కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాలతి,శారద,విచ్చేసి మాట్లా డుతూ ఉపాధ్యాయులందరూ ప్రాథమిక స్థాయి విద్యా ర్థులకు తెలుగు,ఇంగ్లీష్,గణితములో ఫౌండేషన్ పై దృష్టి సారించాలని ఈనెల 30,31 తేదీలలో మూడవ తరగతి విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్‌మాక్, టెన్త్2 నిర్వ హించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయులు ఐ నాగయ్య, రాజేశ్వరి, అల్వాల్ రెడ్డి,శ్రీనివాస్ రావు,స్వరాజ్యం,లక్ష్మి,ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, బిచ్చ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

## గీతామందిర బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే దంపతులు

**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ పట్టణంలో శ్రీమద్భగ వద్గీతా మందిర 28వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈకార్యక్ర మంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్పదంప తులుపాల్గొనిస్వామివారినిదర్శించుకున్నారు. ఈకా ర్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ మురారి శెట్టి ఉమారాణి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ ద్వారానే నల్లగొండకు కార్పొరేషన్ హోదా




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండకు కార్పొరే షన్ అర్హత వచ్చింది అంటే అందుకు బిఆర్ఎస్ చొర వతోనే సాధ్యమైందని ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు.బుధ వారం నల్లగొండలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డితో కలిసి కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల మొదటి జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్ల గొండ మున్సిపాలిటీని గతంలో కాంగ్రెస్ పాలకులు నిర్లక్ష్యం చేస్తే బిఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండను సుందర నగరంగా మార్చిందని తెలిపారు. తెలం గాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, సింగం రామ్మో హన్,అభిమన్యు శ్రీనివాస్ తదరున్నారు.

## సమష్టిగా పని చేస్తే గెలుపు మనదే

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : వచ్చే నెల 11న జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికలలో అందరూ సమిష్టిగా పనిచేస్తే భారీ విజయంతో పాటు అన్ని సీట్లు మనవి అని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గెలుపు కోసం పార్టీ ముఖ్య నాయకులు అభ్యర్థులతో కలిసి ఆయన ఇంచార్జ్ నంద్యాల దయాకర్ రెడ్డితో కలిసి పోచంప ల్లిలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పోచంపల్లి మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లుగా గెలిచే సత్తా ప్రజల్లో విశ్వాసము ప్రజా నాయకుడిగా బలమైన నాయకులకు ఉన్న వాళ్ళకే బీఫామ్ ఇస్తామని ప్రజల ఆశీర్వాదం తమకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. మార్కండేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల రథోత్సవ



కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటిసి కోట మల్లారెడ్డి పుష్పలత, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కందాడి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## నల్లగొండ కార్పొరేషన్ కాంగ్రెస్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల



**మేయర్ అభ్యర్థిగా బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ సర్వం సిద్ధం చేసింది.48 మంది కార్పొరేటర్ అభ్య ర్థులకు గాను కార్పొరేషన్ మేయర్ గా బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో పాటు 44 మంది కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థుల జాబితాను రాష్ట్ర రోడ్లు,భవ నాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధ వారం ప్రకటించారు.నల్లగొండ ప్రజలు ఎంతోకా లంగా వేచి చూస్తున్న ఒక దీర్ఘకాలిక స్వప్నాన్ని నల్ల గొండ మునిసిపాలిటీని ఇప్పుడు నల్లగొండ మునిసి పల్ కార్పొరేషన్ చేసుకున్నాము.ఇది నల్లగొండ అభి వృద్ధి చరిత్రలో ఒక సువర్ణాధ్యాయయన్నారు.ఇప్ప టికే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత దాదాపు 2200 కోట్ల రూపాయలతో నల్లగొండ పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు వేగంగా ప్రగ తిలో ఉన్నాయి.రాబోయే రోజులలో ఇంకా నల్లగొం డకు మరిన్ని నిధులు తీసుకువచ్చి,రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సహకారంతో నల్లగొండను తెలంగా ణలోనే నెంబర్ వన్ పట్టణంగా ఒక సూపర్ స్మార్ట్ సిటీ గా అభివృద్ధి చేయాలనే బాధ్యతను నా భుజాల పైన వేసుకొని దృఢ సంకల్పంతో నేను ముందుకు సాగుతున్నాని మంత్రి పేర్కొన్నారు.

## ఈనెల 30న తెలుగు భాషా వికాసంపై జాతీయ సదస్సు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ప్రముఖ విద్యాసం స్థ నాగార్జున ప్రభుత్వ కళాశాల లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన ప్రాచీన తెలుగు భాషా విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజ న్యంతో తెలుగు భాషా వికాసంలో వివిధ వైఖరులు అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహిం చనున్నామని అ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సము ద్రాల ఉపేందర్, సదస్సు సంచాలకులు డాక్టర్ వెల్దండి శ్రీధర్ తెలిపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా తెలుగు భాషా స్వరూపం, వినియోగం మారుతున్నా యి.ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సామాజిక మాధ్యమాల వరకు తెలుగు భాష ప్రయాణించిన తీరును, ఎదుర్కొంటున్న సవాళ్లను ఈసదస్సు విశ్లే షించనుంది.ముఖ్యంగా భాషా వికాసంపై ఉన్న భిన్న దృక్పథాలను ఒకే వేదికపైకి తీసుకురావడం సదస్సు ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.ఈ సదస్సుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ కేంద్ర, రాష్ట్ర విశ్వవి ద్యాలయాల నుండి సుప్రసిద్ధ ఆచార్యులు,భాషావే త్తలు, పరిశోధక విద్యార్థులు,అధ్యాపకులు తమ పరి శోధనా పత్రాలను సమర్పించనున్నారని తెలిపారు.

## బహుమతులు ప్రదానం

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని మల్లపు రాజుపల్లి గ్రామంలో ఇటివల జరిగిన77వ గణ తంత్ర దినోత్సవం సందర్భంగా సిపిఐ గ్రామ శాఖ నాయకులు చెన్నోజు వెంకటాచారి,పల్లేటి దశరథ, గొడ్డెటి సత్తయ్య,గొడ్డెటి రామచంద్రం నిర్వహించిన ఆటపోటిలలో గెలుపొందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ మంటిపల్లి మణిమాల శ్రీశైలం యాదవ్,ఉప సర్పంచ్ గజ్జల యాదగిరిరెడ్డి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులు,ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు,యువ కులు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అసహనం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** :ఈనెల 23 నుండి ప్రారం భమైన చెరువుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగే శ్వర స్వామి వారి బ్రహ్మో త్సవాల మౌలిక సదుపా యాలపై నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అసహనం వ్యక్తం చేశారు.బుధవారం మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా దేవాదాయ రెవెన్యూ ఆయా శాఖల సమన్వయంతో పూర్తిస్థాయిలో పర్యవేక్షించి ఏర్పాట్లను పూర్తి చేయాల్సి ఉండగా, కేవలం వారం రోజుల ముందే తూతూ మంత్రంగా ఏర్పాట్లతో బ్రహ్మోత్సవాల నిర్వహణకు పాల్పడ్డా రని,టెండర్ ప్రక్రియను కూడా వారి వారి సొంత మనుషులకే కేటా యించి పూర్తి పనులు చేయకుండా నిధులు స్వాహా చేసే దౌర్భాగ్యా నికి ఒడి కట్టారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చెరు వుగట్టు మాజీ ఎంపీటీసీ మేకల రాజిరెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి,నాయకులు బోయపల్లి శ్రీను,మట్టి పల్లి శీను పాల్గొన్నారు.

## ఉత్తమ పశువైద్యాధికారి ఆర్ఐకి సన్మానం

**ప్రజాపక్షం/త్రిపురారం:** మండల ఉత్తమ పశువైద్యాధికారి ఉత్తమ ఆర్ఐ గా గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులను పొందిన పశువైద్యాధికారి డాక్టర్ నాగేందర్ సైదులను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.సన్మానించిన వారిలో మాజీ పిఎస్ చైర్మన్ అనుముల నర్సిరెడ్డి,అల్లంపల్లి జానయ్య,ధూళిపాల రామచంద్రయ్య,ఇండ్లజానకి రాములు,మాజీ సర్పంచ్ పాండు నాయక్,అనంత రెడ్డి,డ్రిప్ వెంకట్ రెడ్డి,రవికు మార్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అరిగోస.. 4నిమిషాల్లో 444 బస్తాల యూరియా ఖాళీ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మర్రిగూడలో యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారు.శివన్నగూడెం సొసైటీలో బుధవారం ఉదయం 9 గంటలకు స్లాట్ ఓపెన్ చేయగా కేవలం 4 నిమిషాల్లోనే 444 బస్తాలు బుక్ అయ్యాయి.124 మంది రైతులు వీటిని దక్కిం చుకున్నారని ఏఓ సాహస్ తెలిపారు. ఇంత వేగంగా స్లాట్ పూర్తి కావడంతో మొబైల్పై అవగాహన లేని సామాన్య రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు కాపాడుకునేందుకు యూరియా అందక లబోదిబోమంటున్నారు.

## సిఎం కప్ క్రీడా పోటీలు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 30, 31న తేదీలలో జరుగు మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను విజయవంతం చేయా లని ఎంఈఓ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపీడీవో భాస్క ర్‌తో కలిసి సీఎం కప్ సన్నాహక సమావేశంలో నిర్వహించారు. 30న బాలికలకు 31న బాలురకు ఈ క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను మండల స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశానికి పిడిలు ఉపేందర్, ఎన్.వెంకట్రామిరెడ్డి, బి.శ్రీనివాసులు, సత్యమని, ఇమ్రాన్ హాజరయ్యారు.

## చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకు అండగా నిలుస్తుందని గరిడే పల్లి మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్‌మియా అన్నారు. మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో బాధిత కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జుట్టుకొండ రామయ్యకు 60వేలు, వలిశెట్టి రాజ్యలక్ష్మి కి 29వేలు, గడ్డమీది లక్ష్మయ్యకు 60వేలు, అయితగాని లక్ష్మి కి 30వేలు, గుండు మట్టమ్మకు 35వేల రూపాయల చెక్కులను వారికి అందజేశారు.